# ఏరువాక సాగాలో..



అమరచింతలో ఏరువాక తాడును లాగేందుకు వృషభాలను పరుగెత్తిస్తున్న రైతులు

**ఆత్మకూర్:** మండలంలోని పిన్నంచర్ల, మూలమల్ల, తిప్పుడంపల్లి, ఆరేపల్లి తదితర గ్రామాల్లో ఆదివారం సాయంత్రం ఏరువాక పౌర్ణమి వేడుకలను రైతులు ఘనంగా నిర్వహించారు. వృషభాలను అందంగా ముస్తాబు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించి ఎడ్లబండ్ల పోటీలను నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామాల్లో పండుగ వాతవరణం నెలకొంది. అనంతరం సర్పంచ్‌లు, ఎంపీటీసీల చేతుల మీదుగా రైతులకు బహుమతులను ప్రదానం చేశారు.

**అమరచింత:** పట్టణ కేంద్రంలో ఆదివారం ఏరువాక పౌర్ణమి వేడుకలను రైతులు ఘనంగా జరుపుకున్నారు. వృషభాలను రంగులతో చక్కగా అలంకరించి పట్టణ పురవీధుల గుండా ఊరేగించారు. దశమి కట్ట వద్ద సాయంత్రం ఏరువాక తాడు లాగు పోటీలను నిర్వహించారు. పట్టణంలోని పలువురు రైతులు తమ వృషభాలను తీసుకొని పోటీల్లో పాల్గొన్నారు. మొదటి బహుమతిని రాజశేఖర్‌కు చెందిన వృషభాలు సాధించగా, రెండో బహుమతిని శివకు చెందిన వృషభం దక్కించుకుంది. విజేతలకు ముువ్వలతో పాటు షీల్డును మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ చేతుల మీదుగా బహూకరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మీనుగ లక్ష్మి, మాజీ మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ నాగభూషణంగౌడ్, వెంకటేష్, మేర్వరాజు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

**వేడుకల్లో గలాట**

పట్టణంలో నిర్వహించిన ఏరువాక పోటీల్లో ఏరువాక తాడును తెంచింది తమ వృషభాలేనంటూ ఒకరిపై మరొకరు వాదోపవాదాలు చేసుకుంటూ ఘర్షణకు పాల్పడ్డారు. దీంతో పోలీసులు స్పందించి ఇరు వర్గాల వారిని వారించడంతో గొడవ సద్దుమనిగింది. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మంగమ్మ, ఇతర రాజకీయ పార్టీల నాయకులు మాట్లాడుతూ కలిసి మెలిసి జరుపుకొనే సంబురాల్లో ఇలాంటి గొడవలు పెట్టుకోవద్దని, రైతులందరూ సంతోషంగా పండుగను నిర్వహించుకోవాలని కోరారు.

**కొత్తకోట:** ఎన్నో విశిష్టతలకు ప్రతీకగా ఉన్న ఏరువాక పౌర్ణమి సంబరాలను ఆదివారం కొత్తకోట మండల రైతులు ఘనంగా జరుపుకొన్నారు. తెలుగు సంవత్సరం జేష్ఠ్య మాసంలో రోహిణి కార్తె తరువాత ఈ నెల 8వ తేదీన గురువారం మృగశిర కార్తె వస్తుంది. ఈ కార్తెలో ఎండల ప్రభావం తగ్గి ముంగిళ్లు చల్లబడతాయన్నది ప్రజల నమ్మకం. అంతే కాకుండా జేష్ఠ్య పౌర్ణమి నాటికి తొలకరి పలుకరిస్తుంది. అందుకు కృతజ్ఞతగా జరుపుకునే పండుగను ఏరువాక పౌర్ణమిగా పిలుచుకుంటరాని రైతు సంఘం నాయకులు వేముల శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఈ పండుగను పురస్కరించుకొని ఆయన పలు విషయాలను వివరించారు. పశువులను చెరువులు, కుంటల వద్దకు తీసుకెళ్లి, స్నానాలు చేయించి వాటి కొమ్ములకు రంగులు పూస్తారని, కాళ్లకు గజ్జెలు, మెడలో గంటలు, కుచ్చులు కట్టి శరీరం నిండా రంగులు అద్ది అందంగా అలంకరిస్తారని పేర్కొన్నారు. పండుగ సందర్భంగా చేసిన పొంగలిని నైవేద్యంగా పెట్టి ఆ గాటికి ధూప, దీపాలతో పూజలు చేసి చల్లంగా ఉండాలని వేడుకుంటారని, సాయంత్రం మంగళవాయిద్యాలతో గ్రామాల్లోని పశువులన్నింటనీ ఒక దగ్గరికి చేరుస్తారని ఆయన తెలిపారు.



పిన్నంచర్లలో వృషభాల ప్రదర్శన

**అడ్డాకుల:** మండలంలోని కందూర్‌లో ఆదివారం సాయంత్రం ఎరువాక పౌర్ణమి నిర్వహించారు. గ్రామంలోని రైతులు ట్రాక్టర్లు, ఎద్దుల బండ్లతో ప్రధాన వీధుల గుండా ర్యాలీ చేపట్టారు. అనంతరం రామలింగేశ్వరాలయం వద్దకు చేరుకుని పూజలు చేశారు. తర్వాత స్వామి వారి ఆలయం ముందు ఉన్న రథం చుట్టు వాహనాలతో ప్రదక్షిణ చేపట్టారు. మూసాపేట మండలంలోని పలు గ్రామాల్లోనూ వేడుకలు ఘనంగా నిర్వహించారు.

**చిన్నచింతకుంట:** మండలంలోని వివిధ గ్రామాల్లో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల సర్పంచ్‌లు, నాయకులు, యువకులు పాల్గొన్నారు.



కందూర్‌లో..



దాసరపల్లిలో..



దమగ్నాపురంలో..



పిన్నంచర్లలో వృషభాలకు పూజలు నిర్వహిస్తున్న రైతులు



గెలుపొందిన వృషభాలకు బహుమతులు అందిస్తున్న చైర్‌పర్సన్ మంగమ్మ

## అంబేడ్కర్ సిద్ధాంతాలు పాటించాలి

**వనపర్తి టౌన్:** జేబీఎస్ఎస్ (జై భీమ్ స్వచ్ఛంద సేవా సంస్థ) నూతన కార్యవర్గాన్ని ఆదివారం జిల్లా కేంద్రంలోని జేబీఎస్ఎస్ కార్యాలయంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మేరకు కమిటీని చంద్రశేఖర్, శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఎనుకున్నట్లు జిల్లా అధ్యక్షుడు మోజర్ల కృష్ణ తెలిపారు. నూతన కమిటీలో అధ్యక్షుడిగా మోజర్ల కృష్ణ, ఉపాధ్యక్షులు మధ్యల ఆనంద్, శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి చెన్నకేశవులు, కోశాధికారి గోవింద్, కార్యదర్శులు సిద్ధి రవి, దాసరి కృష్ణ, మహిళా కార్యదర్శి మద్దెల తిరుపతయ్య, ప్రచార కార్యదర్శి కర్నె శివశంకర్, సాంస్కృతిక కార్యదర్శి గోపాల్, సాంకేతిక కార్యదర్శి మూలె పులేంద్రనాథ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు కృష్ణ, ఉపాధ్యక్షులు మాట్లాడుతూ.. ఈ కమిటీ ఆధ్వర్యంలో సామాజిక సేవలతో పాటు, అంబేడ్కర్ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తామన్నారు.



ఎన్నికైన నూతన కార్యవర్గ కమిటీ సభ్యులు

## బీసీ సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శిగా సురేష్

**వనపర్తి టౌన్:** రాజ్యసభ ఎంపీ, జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య హైదరాబాద్‌లోని కేంద్ర కార్యాలయంలో ఎం.సురేష్‌ను బీసీ సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శిగా నియమిస్తూ ఆదివారం నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ.. కృష్ణయ్య 45 ఏళ్లలో బీసీల హక్కుల సాధన కోసం ఎన్నో పోరాటాలు చేశారని, పాఠశాలలు, కళాశాలలు, హాస్టల్ ఏర్పాటు చేశారని చెప్పారు. మున్సిపాలిటీ, గ్రామ పంచాయతీ ఎన్నికల్లో రిజర్వేషన్లు అమలు చేసేలా ఉద్యమాలు చేయడం, బడుగు బలహీన వర్గాల కోసం స్కాలర్‌షిప్‌లు పెట్టించారని గుర్తుచేశారు. త్వరలో బీసీ యువత ఉద్యమాలు చేసి బీసీలకు చట్టసభలో 50శాతం రిజర్వేషన్ సాధించడంలో భాగంగా తనకు అప్పగించిన ఈ బాధ్యతకు న్యాయం చేకూరుస్తానని చెప్పారు. కార్యక్రమంలో బీసీ సంఘం రాష్ట్ర కార్యదర్శి అరవింద్‌స్వామి, బాలు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## బీరప్ప ఆలయ నిర్మాణానికి రూ.70 వేలు విరాళం

**పాన్‌గల్:** మండలంలోని మాందాపూర్‌లో నూతనంగా నిర్మిస్తున్న బీరప్ప ఆలయానికి కొల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు సీఆర్ జగదీశ్వర్ రావు రూ.70 వేలు విరాళం ప్రకటించారు. విరాళంగా ప్రకటించిన నగదును ఆదివారం కాంగ్రెస్ నాయకులు కృష్ణ, ఉప సర్పంచ్ బాలరాజు ఆధ్వర్యంలో విరాళం నగదును ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. కుర్వల ఆరాధదైవం బీరప్ప ఆలయ నిర్మాణానికి సీఆర్ జగదీశ్వర్‌రావు రూ. 70 వేలు విరాళం అందజేయడంపై ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రాజు, వెంకటేష్, ఉస్సేన్, పరమేష్, బాలు పాల్గొన్నారు.



## బాధిత కుటుంబానికి పరామర్శ

**అడ్డాకుల:** మండలంలోని బలీదుపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు వీరస్వామి ఇటీవల అనారోగ్యానికి గురై మృతి చెందాడు. బాధిత కుటుంబాన్ని ఆదివారం రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి సతీమణి వాసంతి పరామర్శించారు. రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు. ఎంపీటీసీ గణేష్, గ్రామ కమిటీ అధ్యక్షుడు నరసింహ, ఆంజనేయులు, యాదయ్య సాగర్, వెంకటేష్, కరుణాకర్‌గౌడ్, కుర్మన్న, కృష్ణయ్య, జానకిరాములు తదితరులు ఉన్నారు.

## పోలీస్ వ్యవస్థకు ఏం చేశారో చెప్పాలి

**ఎర్రవల్లి చౌరస్తా:** ప్రభుత్వం పోలీస్ వ్యవస్థకు ఏం న్యాయం చేశారో సమాధానం చెపాల్సని బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జ్ ఎం.జి కృష్ణ డిమాండ్ చేశారు. ఆదివారం ఇటిక్యాల మండలంలోని ఎర్రవల్లి చౌరస్తాలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన దశాబ్ది ఉత్సవాలకు వ్యతిరేకంగా నిరసన చేపట్టారు. ఆయన మాట్లాడుతూ పోలీస్ బందోబస్తు లేకుండా ఎమ్మెల్యేలు, మంత్రులు బయటకు రాగలరా అని ప్రశ్నించారు. పోలీసులతో నిరంతరం వెట్టి చాకిరి చేయించుకుంటూ కనీసం టీఏ, డీఏలు కూడా సక్రమంగా ఇవ్వడంలేదని మండిపడ్డారు. 2009, 2012 బ్యాచ్‌లకు చెందిన ఎస్ఐలకు నేటికి పదోన్నతులు ఇవ్వలేదన్నారు. పోలీస్ వ్యవస్థకు పదేళ్లలో ఎన్ని రూ.కోట్లు ఖర్చు చేశారో సమాధానం చెప్పాలన్నారు. కార్యక్రమంలో మహేష్, మధుగౌడ్, మణికుమార్, సుంకన్న, మోహన్‌రాజ్, తిరుపాల్ ఉన్నారు.

# రైతన్నల పొలం బాట

**ఖిల్లాఘనపురం:** మండలంలో రైతన్నలు సాగు సిద్ధమయ్యారు. మండలంలో ఈ ఏడాది ఎండా కాలంలోనూ వర్షాలు కురవడంతో రైతులు ముందస్తుగానే దుక్కులు సిద్ధం చేసుకున్నారు. రోహిణి కార్తెలో తొలకరి పలకరించడంతో రైతులు సిద్ధంగా ఉన్న దుక్కుల్లో పత్తి విత్తనాలను విత్తుకుంటున్నారు. కొందరు రైతులు ట్రాక్టర్ల సహాయంతో దుక్కులు సిద్ధం చేసుకుంటుండగా.. మరి కొందరు గుంటుక తోలడం, చెత్తను తొలగించడం తదితర పనులతో బిజీగా మారిపోయారు. అదును దాటుతుందని రోహిణి కార్తెలో విత్తనాలు విత్తుకుంటే మంచి దిగుబడి వస్తుందనే నమ్మకంతో రైతులు ఉదయం నుంచి రాత్రి వరకు పొలం పనుల్లో ఉంటున్నారు. మరో వాన కురిస్తే విత్తిన పత్తి విత్తనాలు మొలకెత్తుతాయని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



పత్తి విత్తనాలు విత్తేందుకు సాళ్లు తోలుతున్న రైతు



ఒట్టి పొలంలోనే పత్తి విత్తనాలు నాటుతున్న కూలీలు

## రైతుబీమా అర్హత వయస్సు పెంచాలి

**వనపర్తి టౌన్:** ప్రభుత్వ ఉద్యోగులకు రిటైర్మెంట్ 63ఏళ్లకు పెంచినట్లు రైతుబీమా అర్హత వయస్సు 58 ఏళ్ల నుంచి 63ఏళ్లకు పెంచాలని డీసీసీ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. చెరువు వెనకాల ఉన్న పంట కాల్వలను సిమెంట్ లైనింగ్ చేయాలని, సబ్సిడీ విత్తనాలు, రైతులకు పనిముట్లు అందజేయాలన్నారు. రైతు రుణమాఫీ పత్రం విడుదల చేయాలని, ధాన్యాన్ని కొనుగోలు చేయడమే కాకుండా సరైన సమయంలో రైతుల అకౌంట్‌లో డబ్బులు జమ చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధి కూలీలను దశాబ్ది ఉత్సవాల్లో వారి పనులు మానిపించి ఉపయోగించుకోవడం సరికాదన్నారు. కార్యక్రమంలో జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు వేముల శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పర్వతాలు, నాయకులు జాన్, మన్నెంకొండ, ఎల్లన్న, నాగరాజు, అబ్దుల్లా, సందీప్ కుమార్, పురుషోత్తం యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్

## శిథిలావస్థలో పాఠశాల అదనపు గది

**పెబ్బేరు రూరల్:** శ్రీరంగాపురం మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీ పాఠశాల వద్ద నిర్మించిన అదపు గది శిథిలావస్థకు చేరింది. 15ఏళ్ల క్రితం పాఠశాలకు అదనపు గది మంజూరు కావడంతో కాంట్రాక్టర్ గది కప్పు వరకు నిర్మాణం చేపట్టారు. ఆ గది పైన 11కేవీ వైర్లు అడ్డు రావడంతో కాంట్రాక్టర్ అధికారులు, నాయకులకు తెలిపినా.. వారు స్పదించక పోవడంతో మధ్యలో వదిలేశారు. అపట్లో గ్రామస్తులు అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదు. వారి అలసత్వంతో ప్రభుత్వ సొమ్ము వృథా అయిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. నిర్మాణంలో నాణ్యత లోపించడంతో గది పిల్లర్ల సీకులు తేలి శిథిలావస్థకు చేరుకుందని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి శిథిలావస్థలో ఉన్న గదిని తొలగించి చిన్నారులను ప్రమాదం నుంచి కాపాడాలని గ్రామస్తులు కోరారు.



సీకులు తేలిన పిల్లర్లు

## ట్రాఫిక్ సమస్యను తీర్చండి

**ఆత్మకూర్:** మున్సిపాలిటీ పరిధిలోని గాంధీచౌక్‌లో ట్రాఫిక్ సమస్యతో ఇబ్బందులు పడుతున్నామని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రతినిత్యం ట్రాఫిక్‌తో సమయం వృథా అవుతుందని, దీనిపై పాలకమండలి, పోలీసులు దృష్టిసారించాలని కోరుతున్నారు. గాంధీచౌక్ నుంచి కొత్తకోట రోడ్డు, బస్టాండ్ రోడ్డు, అమరచింత రోడ్డు వైపుగా డివైడర్ల నిర్మాణ పనులు నత్తనడకన జరుగుతున్నా కారణంగా ట్రాఫిక్ సమస్య తలెత్తుతున్నాయని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. డివైడర్ల నిర్మాణాలతో పాటు రోడ్డుకు ఇరువైపులా సీసీరోడ్ల నిర్మాణాలు, చెరువుకట్ట నుంచి గాంధీచౌక్ వరకు బీటీరోడ్డు నిర్మాణ పనులు త్వరలోనే చేపడుతామని చైర్‌పర్సన్ గాయత్రి అన్నారు.



గాంధీచౌక్‌లో నిలిచిపోయిన వాహనాలు

## మైసమ్మ జాతరకు పోటెత్తిన భక్తులు

**పెద్దకొత్తపల్లి:** మండల పరిధిలోని నాయనోనిపల్లి మైసమ్మ జాతరకు ఆదివారం భక్తులు అధిక సంఖ్యంలో హాజరై మైసమ్మ దేవతకు నైవేద్యాలు సమర్పించుకుని మొక్కులు తీర్చుకున్నారు. జాతరకు వివిధ ప్రాంతాల నుంచి గద్వాల, వనపర్తి, నాగర్‌కర్నూల్, కొల్లాపూర్, పెబ్బేరు, వివిధ ప్రాంతాల నుంచి ప్రైవేటు వాహనాల్లో భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. వానాకాలం సీజన్ ప్రారంభమయ్యే ముందు రైతులు, వ్యవసాయ కూలీలు వచ్చి పంటలు బాగా పండాలని మైసమ్మ దేవతకు నైవేద్యాలు సమర్పించుకుని మొక్కలు తీర్చుకున్నారు. భక్తులను చేరవేసేందుకు నాగర్‌కర్నూల్, కొల్లాపూర్, వనపర్తి ప్రాంతాల నుంచి ఆర్టీసీ వారు భక్తులను, ప్రయాణికులను చేరవేశారు. ఈ వారం దాదాపు ఆరువేల మంది భక్తులు హాజరైనట్లు ఎండోమెంట్ అధికారి తెలియజేశారు.



మైసమ్మ దేవతకు మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

## ప్రజల పక్షాన పోరాడుతాం

**కల్వకుర్తి రూరల్:** పట్టణంలో వంద పడకల ప్రభుత్వ ఆస్పత్రి సాధనకు ప్రజల పక్షాన పోరాడుతామని బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ శేకర్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట వంద పడకల ఆస్పత్రి కోసం బీజేపీ పట్టణ అధ్యక్షుడు నర్సింహ అధ్యక్షతన నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా శేకర్‌రెడ్డి మాట్లాడారు. కల్వకుర్తి పట్టణం మీదుగా రెండు హైవేలు వెళ్తున్నాయన్నారు. ప్రతినిత్యం ప్రమాదాలు జరిగి ఎంతో మంది గాయపడటంతో పాటు చికిత్స అందక సామాన్య, పేద, మధ్యతరగతి ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నా.. ప్రభుత్వానికి పట్టడం లేదన్నారు. ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ ఏ మాత్రం పట్టించుకోకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రభుత్వ ఆస్పత్రి సాధనకు నిరంతరం పోరాడుతామని హెచ్చరించారు. పట్టణ అధ్యక్షుడు నర్సింహ, రాఘవేందర్‌గౌడ్, దుర్గప్రసాద్, ఎంపీటీసీ నర్సిరెడ్డి, కిష్టారెడ్డి, శేకర్‌రెడ్డి, శ్యాంసుందర్, సురేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శేఖర్‌రెడ్డి

## విజేతలకు బహుమతులు అందజేత

**కేటీదొడ్డి:** మండలంలోని సోంపురంలో ఏరువాక పౌర్ణమిని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన బండలాగుడు పోటీలు, ఎద్దుల గిరక పోటీలను సర్పంచ్ తిక్కన్న హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పండుగపూట పోటీలను నిర్వహించడంతో ప్రజలకు ఆహ్లాదాన్ని నింపడంతో పాటు రైతుల మధ్య సమైక్యభావం పెరుగుతుందన్నారు. అనంతరం గెలుపొందిన ఎద్దులను ఊరేగించారు. మొదటి బహుమతి రూ.3,500, రెండో బహుమతి రూ. 3వేలు, మూడవ బహుమతి రూ.1500 అందజేశారు. గువ్వలదిన్నెలో ఎద్దుల గిరక పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి మొదటి బహుమతి రూ.10వేలు రెండో బహుమతి రూ.6వేలు, మూడో బహుమతి రూ.4వేలు, నాల్గవ బహుమతి రూ.3వేలు అందజేశారు.

**రన్నింగ్ పోటీలో..**

మండలంలోని వెంకటాపురంలో ఏరువాక పౌర్ణమిని పురస్కరించుకుని ఆదివారం బీఆర్ఎస్ నాయకుడు గోపి ఆధ్వర్యంలో నిర్వహించిన 2కిలో మీటర్ల పరుగు పందెం పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. మొదటి బహుమతి వీరేష్, రెండో బహుమతి హరికృష్ణ, మూడో బహుమతి రంగస్వామి గెలుపొందారు.

## రాష్ట్రస్థాయి పోటీలకు గోపాల్‌పేట విద్యార్థులు



**గోపాల్‌పేట:** మంచిర్యాల జిల్లాలో సోమవారం నుంచి మూడు రోజుల పాటు నిర్వహించే రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో ఆడేందుకు గోపాల్‌పేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినుల జట్టు ఎంపిక అయిందని పాఠశాల పీడీ సురేందర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికయిన వారిలో స్వరూప, వైష్ణవి, శైలజ, మీనాక్షి, శృతి, ప్రణవి, మాధవి, జ్ఞానేశ్వరి, శిరీష, లావణ్య ఉన్నారు.

## ఘనంగా వట సావిత్రివ్రతం

**ఎర్రవల్లిచౌరస్తా:** ఇటిక్యాల మండలంలోని పెద్దదిన్నెలో ఏరువాక పౌర్ణమిని పురస్కరించుకుని ఆదివారం సుదాపండితులు సత్యప్రియ ఆచార్యులు వట సావిత్రీ వ్రతాన్ని వేదమంత్రాల నడుమ ఘనంగా నిర్వహించారు. పాడి పంటలు బాగా పండి రైతులు సుభిక్షంగా ఉండాలని కోరుతూ వీహెచ్‌పీ ధర్మ ప్రచార కమిటీ ఆధ్వర్యంలో విజయ ధ్వజారోహణ కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు.

## ఎమ్మెల్సీ సహకారంతో సమస్యకు పరిష్కారం



**కల్వకుర్తి రూరల్:** మండలంలోని తాంద్రలో ఇటీవల గాలివానకు విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయి. దీంతో రైతులు సమస్యను బీఆర్ఎస్ నాయకుడు సురేందర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్సీ కసిరెడ్డినారాయణరెడ్డి విద్యుత్ అధికారులతో మాట్లాడి కొత్త స్తంభాలను ఏర్పాటు చేయించారు. కార్యక్రమంలో రైతులు అల్లాజి, శ్రీను, బక్కయ్య, రాములు, ముంత అశోక్, వెంకటసాయిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### కనులపండువగా శివపార్వతుల కల్యాణం



**కొత్తకోట:** మండలంలోని కానాయపల్లి శివారులో గల శ్రీ కోటిలింగేశ్వర ఆలయంలో 16వ వార్షిక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని ఆదివారం శివపార్వతుల కల్యాణాన్ని అర్చకులు కనులపండువగా జరిపించారు. పరిసర గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారికి పూజలు చేశారు. అంతకుముందు ఆలయంలోని శివలింగానికి అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు భక్తులను అన్నదానం ఏర్పాటు చేశారు.

### హజ్ యాత్రికులకు సన్మానం



**వనపర్తి:** జిల్లా వ్యాప్తంగా హజ్‌యాత్ర చేసేందుకు సిద్ధమైన ముస్లింలకు ఆదివారం జిల్లా కేంద్రంలోని ఎంబీ గార్డెన్‌లో పెద్దమందడి ఎంపీపీ మేఘారెడ్డి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ముస్లిం తమ జీవితంలో ఒక్కసారైనా.. హజ్ యాత్ర చేసేందుకు ఆసక్తి చూపిస్తారని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు రమేష్‌గౌడ్, నాయకులు సతీష్, కౌన్సిలర్లు బ్రహ్మంఆచారి, వెంకటేష్, రాధాకృష్ణ, నాయకులు లతీఫ్, ఫజల్, షోయబ్ తదితరులు ఉన్నారు.

### వడదెబ్బతో వాచర్ మృతి

**వీపనగండ్ల:** మండలంలోని పుల్గర్‌చర్లలో హరితహారంలో వాచర్‌గా పనిచేస్తున్న జుర్రు బీరయ్య(60) వడదెబ్బకు గురై ఆదివారం మరణించారు. గ్రామస్తుల కథనం ప్రకారం శుక్రవారం హరితహారం మొక్కలకు నీరు పోసేందుకు వెళ్లి ఆయన అస్వస్థకు గురికాగా గ్రామంలో ప్రథమ చికిత్స చేయించగా శనివారం జరిగిన రైతు సంబరాల్లోనూ పాల్గొన్న మృతుడు ఆదివారం బయలు భూమికి వెళ్లి అక్కడే మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. మృతుడికి భార్య చెన్నమ్మ, ఒక కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

### అల్లుకున్న నిర్లక్ష్యం



**పాన్‌గల్:** మండల కేంద్రంలోని కేఎల్ఐ కాల్వ సమీపంలో విద్యుత్ స్తంభాన్ని తీగ జాతి మొక్క చుట్టుకొని ప్రమాదకరంగా మారింది. ఈదురు గాలులు, వర్షాలకు ఎప్పుడు ఏ ప్రమాదం చోటు చేసుకుంటుందోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. వర్షాకాలానికి ముందు విద్యుత్ స్తంభాల సమీపంలో ప్రమాదకరంగా ఉన్న చెట్లను తొలగించాల్సిన విద్యుత్ అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు స్పందించి ప్రమాదాలు చోటుచేసుకోకముందే సమస్యను పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు.

### ప్రమాదబీమా కార్డుల పంపిణీ



**పాన్‌గల్:** కాంగ్రెస్ సభ్యత్వం తీసుకున్న ప్రతి కార్యకర్తకు పార్టీ అండగా నిలుస్తుందని డీసీసీ సేవాదళ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఇర్షాద్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో పార్టీ సభ్యత్వం ఉన్న కార్యకర్తలకు ప్రమాద బీమా కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పార్టీ సభ్యత్వం ఉండి ప్రమాదంలో మరణిస్తే పార్టీ తరపున రూ. 2 లక్షల ప్రమాద బీమాను అందజేస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ పార్టీ సభ్యత్వం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కొండల్, నిరంజన్, కార్యకర్తలు పాల్గొన్నారు.

### ప్రభుత్వ కళాశాలల్లో మెరుగైన విద్య

**వీపనగండ్ల:** ప్రైవేట్ కళాశాలలకు దీటుగా ప్రభుత్వ కళాశాలల్లోనూ అన్ని వసతులను ప్రభుత్వం సమకూర్చినందున విద్యార్థుల తల్లిదండ్రులు వారి పిల్లలను మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలోనే చేర్పించాలని ప్రిన్సిపాల్ రాంరెడ్డి కోరారు. ఉచిత పాఠ్యపుస్తకాలతో పాటు విశాలమైన గదులు, సైన్స్ పరికరాలు, అనుభవజ్ఞులైన అధ్యాపకులచే విద్యా భోదన చేస్తున్నామని తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాల 10వ తరగతిలో ఉత్తీర్ణులైన విద్యార్థులతో పాటు చిన్నంబావి మండలంలోని గ్రామాల విద్యార్థులు కూడా స్థానిక ప్రభుత్వ కళాశాలలో చేరాలని ఆయన కోరారు.